# రాజీ

అల్లం రాజయ్య

బొగ్గు పిట్‌ల నుంచి బయటపడి నెత్తిమీద సేఫ్టీక్యాపు తీసిపట్టుకొని నిలబడ్డాను- బయటి చల్లగాలికి ఉల్లాసంగా, హాయిగా ఉంది అప్పుడు (ఆకాసేపు). ఇందాక హూన మైపోయిన ఒల్లుసంగతి గుర్తుకురాలేదు. సెంటర్ జైలునుండి అప్పుడే విడుదలైన ఖైదిలా ఫీలయ్యాను- పిట్‌లోపల బొగ్గుపొరలమధ్య విపరీతమైన వేడి, అసలే ఉడికి పోతుంటే పైగా దొయిదొరల తిట్లు.... టార్గెటు రెండు టబ్బులు నింపుతనే ఆరోజు జీతమని ఓరల్ కండీషన్. అంతపెద్ద బొగ్గు తట్టెత్తుకుంటె మెడలు జివజివలాడ్తాయి- కాళ్లు జువజువ వంగుతాయి- అలాగా రెండు టబ్బులు నింపేసరికి తాతలుదిగొస్తరు. (ఈమధ్యనే సర్కారువారు బొగ్గు కంపెనీలల్లో అడుగుబెట్టిన తరువాతే టబ్బులు కూడ పెద్దవైనయట....) పదిమంది కలిసి చిత్తుగా తన్ని తగిలేసినట్టు గుంటుంది. ఇవ్వాల్టికి గండం గడిచిందని పిట్ బయట పడతారు కార్మికులు. సైకిలున్నోల్లు సైకిల్లమీద వెల్లి పోతే- సైకిల్లులేనోల్లు లెఫ్ రైటే- కాలినడక రెండుమైల్లు నడువాలి ఈడ్చుకుంటూ- అయినా తప్పదుకదా! ఒక్కొక్క అడుగు లెక్కపెడుతూ, వెనుకకు ముందుకు చూసుకుంటూ ఇల్లు చేరుకోవాల్సిందేకదా!

మెడెత్తి ముందటికి చూశాను- నీర్సం కమ్మేస్తోంది. నీలికొండల మాదిరిగా కాకుండా డొక్కు గుడిసెలవరుస కన్పిస్తోంది. దానవ్వ! అలాకన్పిస్తుందే కాని గుడిసె అంత త్వరగారాదు. అడుగు ముందుకేశాను.

"తమ్మీ!" ఎవరో పిలిచారు. ఇక్కడ నాకు తెలిసిన వాళ్లెవరున్నారబ్బా! చుట్టు చూశాను- నాచుట్టూ మురికి బట్టలతో, పీక్కపోయిన ముఖాలతో, నీల్లుకారే లాగులతో, ఒంటినిండా మసిమరకలతో మనుషుల ఆనవాల్లు గుర్తించకుండా గ్రీసు, ఆయిలుకారే యంత్రాల్లాగా చాలామంది ఉన్నారు. (ఇక్కడో విషయం చిన్నప్పటిది గుర్తుకొస్తోంది.... మా చిన్నమ్మ ఒకతుండేది. ఊరంతటిని చెడగొడ్తుందని దాన్ని ఊరిబయటే ఉంచారు. అదిచేసిన తప్పల్లా కులంకాని వాడితో లేచిపోవడం. వాడు మరెవరితోనో లేచిపోవడం జరిగిన తరువాత అది మాఊరు చేరి బజారు పాలైంది. నాకప్పుడు ఎన్నేండ్లో సరిగ్గా గుర్తులేదు. "చిన్నమ్మా వీళ్లందరిని చూస్తే నీకేమనిపిస్తుందే?" "ఏమనిపిస్తే ఏం లాభం?" 'మరి నన్నుచూస్తే?' "మొగాడని పిస్తుంది.." అని పగలబడి నవ్వేది. చెప్పచ్చేదేమంటే దాని జీవితం అందరిని ఒక్కలాగే చూడడం నేర్పింది.) ఏముఖం నావేపు ఆసక్తిగా చూడడం లేదు. సీనియర్ కార్మికులు జట్లు జట్లుగా పోరమన్‌లను,

పిట్ మేనేజర్లను, మొకదమ్‌లను, సర్దార్లను తిట్టుకుంటూ నడుస్తున్నారు. ఎవరో ఎవరినో పిలిచారు కాబోలని ఇంకొక అడుగేశాను.

"నేనేతమ్మీ గుర్తుపట్టలేదా?" నాపక్కనుండే ఎవరో అంటున్నారు. ప్రక్కకు చూశాను. బాగా వంగిపోయి, బొగ్గు మసితో, పీక్కుపోయిన ముఖంలో జ్యోతుల్లాగా మండుతున్న కళ్లతో - సిగరెటు అలవాటుకు గుర్తుగా పెదిమల మీద పూతతో అతను నాదాకావచ్చి కరచాలనం చేశాడు. నిజంగానే నేను గుర్తు పట్టలేక పోయాను... అందరి ముఖాలు రగులుకునే రాక్షసి బొగ్గులే - ఎలా గుర్తుపట్టగలం-

అతనే అన్నాడు. "హైదరాబాదులో మనిద్దరం పైరవికోసం పోయి అదేదో హోటల్లో కలిశాం గుర్తుందా?"

నిదానించి చూశాను. ఇప్పుడు తెలిసింది. బాను అతను - అతనిపేరు సాయిలు - అవును అవే చిలికికళ్లు, దొడ్డుపెదిమలు - మనిషికాస్త వంగిపోయాడు - ముసలితనం వల్ల కాదు - పనివల్ల -

"గుర్తుకొచ్చింది" అన్నాను నేను నడుస్తూ -

"గుర్తుపట్టావన్నమాట - సరే నువ్వు ఈ పాతాళలోకపు పని కెప్పుడొచ్చావు" అతనన్నాడు నావెంటనడుస్తూ -

"రెండు నెలలవుతుంది."

"రెండు నెలలైందా? మరెప్పుడు కనిపించలేదే? అయేఉంటుంది - నేను సిఫ్టులో ఉన్నాను - ఇవ్వాళ్లే డ్యూటీ కొచ్చాను."

హైదరాబాదులో మేము కలుసుకున్న సమయము గుర్తొస్తున్నది. అతను ఏదో మాట్లాడుతున్నాడు - మాటల్లో తిట్లే అధికభాగం - సమాజాన్ని, బొగ్గుగనులను, బొగ్గు గనుల మేనేజర్లను, దేశాన్ని, నాయకులను, మతాలను, యూనియన్లను, అందరినీ వరుసబెట్టి తిడుతున్నాడు - నేను వింటున్నాను. అతని జీవితానుభవం అతనికి తిట్లను తప్ప ఏం మిగల్చలేదు - చివరకు అతను అన్నాడు. "చూడు తమ్మీ నీ వయసెంత మా అంటె ఇరువయేడ్లుండచ్చు. బతుకువెంత గలీజుదో, క్యారమైందో నీకింకా బోధపడలే, ఈదేశమున్నది చూశావు లంగలది లఫంగులది - కష్టపడ్డోనిదికాదు. కష్టపడ్డోని నెత్తి మీదమట్టే - కష్టపడకుండా మోసం చేసెటోడు పైకిపోతడు - నాకనిపిస్తది. నీ ఎదుటోని తలగొట్టటానికి నీకు డెమొక్రసీ - కాకపోతే - గిక్కడి కార్మికులకు మేం నాయకులమని కాంగిరేసులు, కమ్యూనిస్టులు అందరచ్చి చందాలు వసూలు చేసుకొని పెద్దగయి

పోయిందుర్రి- తెల్ల కమ్యూనిస్టోడు భీమ్‌రావ్ ఇక్కడి కొచ్చినప్పుడు సన్నగ పీలగా, పీరిల కర్రోలె ఉండెటోడు. దొబ్బ సైకిలేసుకొని ఖాయ్‌సీల్లు తాళ్ళంట తిర్గెటోడు- ఇప్పుడుచూస్తో ఎందాసిదరుకారు రెండు వెస్పాలు- ఊళ్లె రెండుబంగుళాలు- బేంకుల డబ్బు- బానకడుపు- వాడు మాకు చేసిందేమిటంటే- పండుగ అడ్వాన్సు లిప్పియడం- లంచనుగా జీతాలురోజు చందాలు వసూలు చేయడం- కడుపుగాలి సమ్మెచేస్తే- ముంగట నిలబడి వదిరి ఆఖరికి అటుమేసి సమ్మెకు తూట్లుబొడవడం- ఇప్పుడు నా వయసెంత నలుబై దాటుండొచ్చు. ఇరువై ఏండ్లకింద అయిదో తరగతి పాసైన- అగో గప్పటి నుంచి గిదేతట్ల మోత్తన్న- నావొల్లుచూడు మొత్తం బొగ్గేతినేసింది- నన్నుకోత్తే బొగ్గు తప్ప నెత్తురెల్లది. కాని- నాకేమి మిగలలేదు- నెత్తిమీద ఆఖరుకు వెంట్రుకలు కూడ మిగులలేదు- అవ్విపండిపోయి తెల్లబడి పోయినయ్-" ఆఖరిమాటలు చాలా బరువుగా వచ్చినయ్- గొంతులో ఎన్నేండ్లదో జీర - అలాఅని సేప్టీక్యాపుతీసి వెంట్రుకలు చూయించిండు.

"అంతేనండి-" అన్నాను నేను ప్రసంగాన్ని అంతటితో తుంచేయాలనే తలంపుతో. ఏవ్యక్తి జీవితం చూసినా ఏముంది గర్వకారణం. కడివెడు కన్నీల్లు- కన్నీల్ల వరదపొంగులు- ఉప్పెనలు. అందరి జీవితాలను ఇంత దుఃఖకరంగా మారుస్తున్నది ఒకేఒక బలమైనశక్తి- అదే దోపిడి- అదున్నతరువాత ఈకష్టాలన్ని అనివార్యమైనవే- అందుకే అది పోవాలని ఎందరో మహానుభావులు నిరంతరం పోరాటం చేశారు- ఇంకా చేస్తున్నారు. వాళ్లందరికీ నా వందనములు. కాని నాకిప్పుడు మాట్లాడాలంటేనే యమ బోరుగాఉంది- జీవితమంతా బోలుగా తోస్తోంది- తిరిగి తిరిగి తలతిరిగి పోతోంది. నేను కూడా నా చేతనైనంత అందరిని తిట్టినవాన్నే.... తిట్టి తిట్టి వేసట వచ్చింది. నా జీవిత పరిధి చిన్నదైనా రావాల్సిన ఆటుపోటులన్ని వచ్చాయి. నేను చదివి నౌఖరి చేసి ఉద్ధరిస్తానని మానాన్న ఉన్న రెండెకరాలు తగిలేశాడు. డిగ్రీ కాగితం, ఇంట్లో నాతో నాలుగు పొట్టలు చేతపట్టుకొని ఎక్కని గడపా లేదు. మొక్కని కాళ్లు లేవు. అమ్మాల్సిన వస్తువులన్ని అమ్మేసిన తరువాత ఇంక అమ్మటానికి ఏమి మిగులనిస్థితిలో నేనుంటే కాయితం కూడుబెట్టలేదు. 'కాల్' దొరికితే కాళ్లు తరువాత పట్టుకోవచ్చునను కొని ఆశతో ఎంప్లాయ్‌మెంటు చుట్టు చెత్తకుండి చుట్టు కుంటికుక్క తిరిగినట్టుగా తిరిగాను. అదయిపోయిన తరువాత 'కాల్' ఉత్తగా రాదని తెలిసి, అప్పుజేసి డబ్బుపెట్టి 'కాల్' తెచ్చుకొని, వెధవ ప్రశ్నల ఇంటర్వ్యూలు ఇచ్చినా.... ఎలాగైతేనేం డిగ్రీ భూతం ఉన్నంత వరకు నౌఖరి దొరుకలేదు.

433

"ఏంది తమ్మి బాగా ఆలోచిస్తున్నావు ;" అతనన్నాడు.

ఇంతలోకే హోటల్ చెట్టు వచ్చింది- అది హోటలంటే కనీసం గుడిసెనన్నా కాదు. పట్నం తుమ్మ చెట్టు. దానికింద ఎప్పుడో కాలి బూడిదైన బొగ్గులాంటి ముసలమ్మ- ఎర్రి నీళ్ల చాయ్.

"గీ చాయ్ చూస్తే నాకెందుకో అనిపిస్తుంది- మన రక్తం సరిగా ఇట్లానే ఉంటుందేమోనని-" అతనన్నాడు.

చాయ్‌తాగి చిల్లర డబ్బు లివ్వబోయాను- ముసలమ్మ తీసుకోలేదు. అతను నవ్వాడు- నవ్వి "అది జీతంనాడు తీస్కుంటదిలే, బ్రతుకంతా ఉద్దెరే, నగతసలే లేదు. వోల్ మొత్తం ఖతాయే.." అన్నాడు.

"సరే. గ్రాడ్యుయేటువి గీ నరకంల కొచ్చినవ్. ఆసారి నౌకరి దొరకలేదా?" కొంచెంసేపాగి అతనడిగిండు.

"ఆసారి నువ్వేస్థితిలో వెళ్ళిపోయావో? నేనాస్థితిలోనే వెళ్ళొచ్చాను. ఆసారే కాదు అలా చాలాసార్లు తిరిగిన, కాని లాభం లేకపోయింది. డిగ్రికాయితం చూసి ఎవరూ నౌకరి లేదన్నారు. ఆసారికైతె పాలిచ్చే బర్రెనమ్మిన. ఆ తరువాత అమ్మడానికి ఇంకాఏమి మిగలలేదు. మరింక పైరవి పైసలు లేకుండ నౌకరెట్లా దొరుకుతుంది? మూడేండ్ల తరువాత జ్ఞానోదయమయ్యింది. అనెజ్యుకేటెడుగా కార్డుతీసాను. ఎంప్లాయిమెంటాఫీసరుకు మూడువందలిచ్చిన. మామూలే ఓ పైరవికారుకు పదిహేను వందలిచ్చి గీ పనిలో చేరిన." అన్నాను.

"గీ పనే మొదట చేసుంటే బావుండేది కదూ! ఎంత వడ్డికి తీస్తున్నవ్?"

"నెలకు నూటికి ఎనిమిది రూపాయలు."

"ఎవడా ఎడ్డి మూర్ఖుడు?"

నేను నవ్వాను- అతను నవ్వాడు.

ఇద్దరం విడిపోయే దారొచ్చింది....

"అచ్చా! గుడీవనింగ్ సర్! ఫిర్ మిలేంగే...." నేను బొక్కటోపి ఊపాను.

"అప్పుడే పోతావా? చాలా రోజుల తరువాత కలిశావు. పెండ్లి చేసుకున్నవ- సరెలే.... మా యిల్లు ఇక్కడికి దగ్గరే- కాసేపు కూర్చుండిపోయేవు రారాదు.... ఇఫ్ యూ డోంటుమైండ్!" దూరంగా గుడిసెలవేపు చూయించుతూ అతనన్నాడు.

నేను తటపటాయిస్తున్నాను. నాకోసం లక్ష్మి ఎదురు చూసేది నిజమే.... మాఫిట్‌లో అడపా దడపా ఏపెళ్లోకూలి ఇద్దరో ముగ్గురో చావడం ఈమధ్య తరుచూ

జరుగుతున్నది. అందుకోసం ఇల్లుచేరేదాక ఆదోల్లకు పీచుపీచే. కాని అంతగా అడుగుతున్నాడు. అదికాక అతని ముసలితల్లిని, క్షయరోగపు భార్యను చూసినట్లుగా ఉంటుంది. మార్గంలో అతను చాలా విషయాలు తన ధోరణిలో చెప్పుక పోతున్నాడు. గుడిసెల గురించి, క్వార్టర్ల గురించి.

పందులను, మురికి కాల్వలను, ఏసాటులేకుండా స్నానంచేస్తున్న స్త్రీలను, దాటి గుడిసెలు చేరుకున్నాం. అట్టకప్పులు, పాతతట్టల గోడలుగల గుడిసెలు దాటి క్వార్టర్లు చేరుకున్నాం. సందుగొందులు దాటిన తరువాత ఓ క్వార్టరు ముందాగిండు. క్వార్టరు పనుగడ తీసి నన్ను లోపలికి ఆహ్వానించి తలుపు తట్టాడు.

"వచ్చే, వచ్చే", సన్నని గొంతు. తలుపు తెరుచుకున్నది. ఇంకా పదహారేండ్లు సరిగా నిండని పిల్ల తలుపుతీసింది. నిద్రమబ్బుతో ఉన్నట్టున్నది. నన్నుచూసి కండ్లు టపటప లాడించింది.

"అన్నయ్యపాప. నమస్కారంచేయి." అతను.

ఆమె నమస్కారం చేసింది. లోపలికినడిచాం.

గదిచూచి నాకుమూర్ఛ వచ్చినంత పనైంది. రెండుమంచాలు సరిగాపడవు. ఇరువై సం॥ సర్వీసున్న కార్మికుని క్వార్టరు అగ్గిపెట్టె. ఇతను ఎన్నివేల టన్నుల బొగ్గు తవ్వెండో? సామానే సగమాక్రమించింది. మిగతా సగంలో మంచమున్నది. మంచం మీద వెలిసిపోయిన శద్దరొకటి పరిచిఉన్నది.

అతను ఆమురికి బట్టలతోనే మంచంమీద వాలిపోయిండు. నన్నుపక్కకు కూర్చోమన్నడు.

"అమ్మాపాప, అన్నయ్యొచ్చిండు ఛాయ్‌పెట్టు-"అన్నాడు.

పాప బొగ్గులపొయ్యి అంటించే ప్రయత్నంలో బయట బొగ్గులు చితక్కొడుతోంది. పక్కవాటాలో మొగుడు పెళ్ళాం కాబోలు గుసగుసలాడ్తున్నారు. ఇందులో వయసు మీదున్న అమ్మాయి. ఒంటరిగా ఉండడం చాలాకష్టమే.

గదిని పరీక్షగా చూస్తున్నాను నేను. నాకు అలాంటి గదికూడ దొరకడం దుర్లభమే. ఎన్నేండ్ల సర్వీసున్న ఎవడు సీకిదిగో క్వార్టరని పిలిచియివ్వడు. ఖాళీక్వార్టరు కనిపిస్తే ఆక్రమించడమే.

"ఆఫీసర్లకోసం వారి పెండ్లాలకోసం లంజా కొడుకులు లక్షలు ఖర్చుబెట్టి స్విమ్మింగ్ పూల్ కట్టిచ్చు కున్నారు. మనకు గుడిసెలు గతిలేవు. ఫిట్‌లో చెమటలు

435

కారంగ బొగ్గు తీసేదిమనం. సొమ్మొకడిది. సోకొకడిది. మనం ఈడ నీల్లుదొరకక కొట్టుక సత్తుంటే వాడు ఈత నేర్చుకుంటున్నాడు.” అలా ఇంకేదేదో అంటూనే ఉన్నాడు.

నాదృష్టి ఎదురుంగ ఉన్న ఫోటోమీద పడింది. ఆఫోటో మసిబారి బాగామాసి పోయున్నది. అందులో కుర్చీమీద ముసలమ్మ, ఆమెపక్క ఇద్దరు పిల్లలు వెనుక శాయిలు. ఆవిడ అతనిభార్య కాబోలు నిలబడిఉంది. ఫోటోకు వాడిపోయిన పూలదండున్నది. నాకు షాకయ్యింది.

శాయిలు అది గమనించాడు.

‘ఆఫోటో’లో ఉన్నవారెవ్వరు బ్రతికిలేరు. నేను బ్రతికున్నా ఎప్పుడో చచ్చినవానికిం దేజమ. పాప తను ఎప్పుడో మరణించా ననుకుంటుంది. దానితో వచ్చిన చిక్కేఅది. ” అతని కంఠంలో కదలిన భావాన్ని నేను చెప్పలేను.

“వాళ్లు పోయారా ?” అన్నాను ఆవేదనగా.

“నువ్వు 74 అక్టోబరులో కలిశావు కదూ। డిశంబరులో అమ్మపోయింది. ఆర్నెల్ల తరువాత అదిపోయింది. పోతారని తెలిసికూడా ఏంజేయలేని పరిస్థితిలో వాళ్లిద్దరిని ఒదులుకున్నాను. 1976 లో వాడు తప్పిపోతాడని నాకేం తెలుసు ? వాడెందుకు తప్పి పోయాడు. వాన్ని తరిమేశారు. వాడు చేసిన నేరమేమిటి ? కార్మికులను కూడగట్టాడు- రివిజనిస్టు నా కొడుకుల అంతర్యమేమిటో ఎండగట్టాడు.” అతను ఏకొదమ్మొగ మవునం వహించిండు. అతని కండ్లు శవం కళ్లకుమల్లే తెరుచుకొని వికృతంగా ఉన్నాయి. అతనికి వాళ్లంతా కన్పిస్తున్నారేమొ ?

“ఆసారి ఆ లంజకొడుకు ట్రాన్స్‌ఫర్ చేయిస్తే వాళ్లంతా బ్రతికిపోదురు.... వాళ్లిద్దరిని నిజంగా వాదే సంపేసిండు. కాని వాడింకా మంత్రి. వాడింకా ప్రజల యోగక్షేమాలు, ఆరోగ్యముగట్రా చూస్తూనే ఉన్నాడు. ఘరానా వ్యక్తి. మావోడు మాత్రం నక్సలేటు- వాన్ని దూరంగా తరిమికొట్టాడు- ఏడున్నడో కొడుకు.” అతని కంఠం రుద్ధమైపోయింది. నేను ప్రక్కకు తిరిగి అతని ముఖం చూశాను. అతను నిజంగా ఏడుస్తున్నాడు- కన్నీల్లు చెంపల మీదిగుండా మెడమీదికి చేరుతున్నాయి.

ఏంచెప్పాలో? ఎట్లా సముదాయించాలో? తెలియలేదు.

పాప చాయ తీస్కొచ్చింది.

“చూడన్నా ఎప్పుడు గిల్లేడిస్తే ఏమొస్తది చెప్పు.” అన్నది పాప కలుపుగోలుగా.

436

"నీకుతెలియదే పాప. వాళ్ల చచ్చినారని కాదునాబాధ. వాళ్లను చంపేసింద్రనే. వాళ్ల చంపేస్తుంటే చూస్తూ ఏంచేయ లేక పోయాను." అతను చాయందుకున్నాడు. కళ్ల తుడుచుకున్నడు.

"సారీ! కొండన్న సారీ! నిన్ను ఇక్కడికి తీసుకొచ్చి...."

"నో....నో...." ఇంకేమనాలో తెలియలేదు. చాయ్ సిప్‌చేశాను.

సాయిలు చాయ్‌తాగి పాత్రటంకుపెట్టె నొకదాన్ని తెరిచాడు. అందులోనుండి పాత పుస్తకమొకటి బయటకుతీసి అందులోనుండి ఓ కాయితంముక్క భద్రంగా బయటకు తీసాడు. నాచేతికిచ్చాడు.

"ఈ తుచ్ఛమైన దోపిడి సమాజంతో రాజీపడి కుక్కలాగా విశ్వాసంగా బ్రతకలేను నాన్న! బ్రతికుంటే కలుస్తాను.... వెతుకకు-" ఆకాయితంలో అంతే రాసున్నది. పాత కాయితం ముక్కలో పెన్సిలుముక్కతో ఒక యువకుడు రాసుకున్న కర్తవ్యమది.

మళ్లీ భద్రంగా అతనికిచ్చాను- మాసిపోయిన ఫోటోలోని నెక్కరు పిలగాడు రాజీపడలేడట.... రాజీపడలేని ఆ పిలగాని ముఖం ఇప్పుడెలాగ ఉంటుందో ఊహించుకున్నాను- లేచి నిలబడ్డాను.

"అప్పుడప్పుడు రా! అన్నయ్యా!" పాప చెపుతోంది. మా అన్నయ్య లేని లోటు తీర్చుమన్న ధ్వని ఆ గొంతులో ఉన్నది.

అతనికి నమస్కారం చెప్పి నడుస్తున్నాను- సూర్యుడు మండుతున్నట్లుగా తోచింది. నేను నడుస్తున్నాను.... నా వెనుకే ఆ పిలగాడు నడుస్తున్నట్లుగా ఏదో అనుభూతి.

అతను నేను తొలిసారి హైదారాబాదులో కలిసిన రోజులు గుర్తుకువస్తున్నాయి.

నేను గుమస్తాగిరికోసం ఇంటర్వ్యూకు హైదారాబాదు 74 లో కాబోలు వెళ్లాను. మా వూరి చోటా నాయకునితో కలిసి. అప్పటికే ఈ చోటా నాయకున్ని ఓ ట్రేడ్ యూనియన్ నాయకుడు కలిసిండు. నేనైతే పాలిచ్చే బర్రెనమ్మి డబ్బు నాయకుని చేతిలోపోసి అతని వెంట కుక్కలా తిరుగుతున్నాను. ఆ నాయకుడు మంత్రిగారి చుట్టు తిరుగుతున్నాడు. ఆ రాత్రి హోటల్లో మెట్లమీద కునికిపాట్లుపడుతూ నేను- అతను.... అప్పుడే కలిసింది దోస్తాని.

లాడ్జింగ్- దొరలదే.... లాడ్జింగ్‌పైన ఇకిలింతలు, పకపకలు దొరలవే. అలాంటి ఇకఇకలమధ్య అతను చెప్పాడు.

437

"చూడు నీ పేరేమిటన్నావ్.... కొండయ్య.... కండ్లు తిర్గిపోతన్నయ్. నూటికి అయిదు రూపాల వడ్డీ చొప్పున పదిహేను వందలు తెచ్చిన. మా యిల్లు కొత్తగూడెం లున్నది. ఏదో అన్ననని పనిష్మెంటుగ గోదావరిఖనికి ట్రాన్స్ఫర్ చేసింద్రు. కొత్తగూడెంలో శాశ్వతరోగి అమ్మ, క్షయరోగి భార్య. మందులు వాడాలె- పిల్లల సదువున్నది. డాక్టర్లు వాతావరణం పడదంటున్నారు. గోదావరిఖనిలో నేను, కొత్త గూడెంలో వాళ్లు ఉండాలంటే కష్టంగాఉన్నది. రెండు పొయ్యిలు మండాలంటే ఎంత కష్టం- సరే అప్పు తరువాత తేర్చుకుందామని గీ నాయకున్ని నమ్ముకొని వచ్చిన. పొద్దున ఏమయ్యిందంటే.... ఎనిమిది దాటిందంటే మంతిరి దొరుకడని మంతిరింటి కురికినమ్. మంతిరి పదింటికి లేసిండు. అతనింటి ముంగట అప్పటికే క్యూ.... మాకు దర్శనం దొరికేసరికి పదకొండయ్యింది. మాట్లాడుదామనుకునేసరికే కారెక్కిండు. టాక్సీలెక్కి మేం వెంటబడ్డం. రిడ్జ్ హోటల్లో టిఫిన్.... మంతిరిగారి బంధుకోటి కందరికి కలిసి నూటయాభయి ఎగిరినయ్- తిరిగిన కాడికే తిరిగేసరికి ఒంటిగంట య్యింది- భోజనానికి మళ్లో నూటయాభయి- రెండు వందలు టాక్సీలు మింగినయ్- రాత్రయ్యింది. ఇదిగో గీ లాడ్జింగెక్కింద్రు- మా నాయకుడు సైగ చేసిండు. మూడు వందల చిల్లర సీసాలకు, పైన నవ్వేటోల్లకు చెరినూటయాభై- మళ్లీ టాక్సీబిల్లెంతో.... ఇంతకూ నా మాట మాట్లాడింద్రో లేదో? అంతా గందరగోళంగా ఉంది- పొద్దటి నుంచి కక్కువస్తోంది- పద్మవ్యూహంలో చొరబడ్డ తరువాత...."

ఇంతలోనే "శాయిలూ!" పైనుంచి పిలుపు. శాయిలు పైకురికిండు. ఆతరువాత మరలెటోవెళ్ళి సీసాలతో తిరిగొచ్చిండు. నీర్సంగావచ్చి నాపక్కన కూలబడ్డడు.

"మనపని అయితదంటవా?" నేను. నామనసులో- కొన్నవాడు కొట్టుకుంటూ తీసుకపోతున్న మా 'జగదంబ బర్రె' ఒర్లుతోంది. దీనాతి దీనంగా మావేపు చూస్తోంది. ఇన్నేండ్లు కేవలం గడ్డిగాదంతిని మీకు చిక్కటి పాలిస్తే చివరకు మీరు వెళ్లగొడు తున్నారా? మానాన్న పటపట కన్నీల్లు ఒదులుతున్నాడు. మా అవ్వ నోట్లో కొంగుకుక్కు కొంది. ముసల్ది ఇంకా బర్రెను పునుకుతోంది.

"పరమేశ్వరునికెరుక." రోడ్డుమీద కార్లనుచూస్తూ అన్నాడు.

"యాభయ్యై మిగిలినయ్." మళ్లీ అతనే అన్నాడు- ఏడుపు ముఖంతో.

ఆతరువాత నాకు పిలుపొచ్చింది. పైకిపోయి వాళ్లను చూసిన తరువాత తల తిరిగిపోయింది. వాళ్లు ఉంతువులో మనుషులో అర్థంకాలేదు. వాళ్లందరికి కోరలున్న ట్టుగా, స్వయాన పెద్దపులులే కుర్చీలమీద కూర్చుండి మాంసాన్ని అరగిస్తున్నట్లుగా

తోచింది. ఆడవాళ్లిద్దరి ఒంటిమీది గుడ్డలు చిరిగిఉన్నాయి. ఒకామె కొంగునొకడు గుంజుకున్నాడు. ఇంకొకని చేతిలో ఆవిడ చెయ్యున్నది.

"లంజ నాకు నువ్వేకావాలి." అంటున్నాడు కొంగుపట్టుకున్నతను. "మూలిపళ్ల రాలగొ_ ్త. నాకు ఈలంజే కావాలె_ వీల్లేదు." ఇంకొకడు.

మేనేజర్ ఏదో సదిరి చెప్పుతున్నాడు.

"వీల్లేదంటే వీల్లేదు. ఇంకెవత్తి నాకొద్దు."

"ఇద్దరం ఒకేసారి_ రండి." చీరకొంగతని సలహా. ఆమె ఏడుస్తోంది. గింజు కుంటోంది. ఆమె ఏడుపుకు విలువలేదు.

"సోడాలు పట్రా. పేటర్ ఏన్నోసచ్చిండు. మేనేజర్ డైలమాలో పడ్డడు." అన్నడు మానాయకుడు.

నేను సోడాలు తెచ్చి పైన యిచ్చేటాల్లకు వాళ్లిద్దరు_ ఆమె అక్కడలేరు. నాకు మా చిన్నమ్మ గుర్తుకొచ్చింది. సోడాలిచ్చేసి కిందికొచ్చేనరికి శాయిలు మెడ వేల్లాడేసు కుని కూకుండి బజార్లకు చైతన్య రహితంగా చూస్తున్నాడు.

"ఏమయ్యింది" నేను.

"ఇంతచేస్తే వానవ్వను కుక్కలు దెం.... ఆ మినిష్టరుకు ఈ మినిష్టరుకు మంచిగ లేదట" అన్నడు-

నేను పక్కలో బాంబుపేలినట్టుగా అదిరిపోయాను_ పదిహేను వందరూపాయల నోట్లను ఎవడో కసపిస నమిలి మింగుతున్నాడు.

"మరి పదిహేను వందలు?" నేను అనీ అనకముందే_ అతను చివాలును లేచి నాచేయందుకొని గుంజుక పోయిండు_ "ఇక్కడ మనముంటే ఇంకా అవసరాలు కలు గుతాయి_ చివరకు ఎవని దుకాణమో పగులగొట్టాలె....దా." అని బారుల కీడ్చుక పోయిండు_

నాకు మా అమ్మనాన్న కన్పిస్తుంటే అతను చిత్తుగా తాగిండు- నన్ను బలవంతం చేసిండు_ నాకు అప్పటికే కక్కు వస్తున్నది. అతను ఏదేదో వదురుతూ బయటికొచ్చాడు_

ఆతరువాత అతను నాదగ్గర అయిదు రూపాయలదుక్కొని ఆరాత్రే వెళ్లి పోయిండు.

నాకు తెలియకుండానే గుడిసె చేరుకున్నాను. నాకోసం లక్ష్మి నిజంగానే ఎదురు చూస్తోంది.

439

## 2

ఈ దేశంలో ఎవడి జీవితానికి భద్రతలేదు. ఏ క్షణంలో బ్రతుకు ఏఅండలేకుండ నడిబజారులో నిలబడుతుందో ఎవడు చెప్పలేడు. శ్రామికుల జీవితాలు అంతే. శ్రామికుల జీవితాలు ఎంతఅనిశ్చితమైపోతే దోపిడిదార్ల మనుగడకు అంతముప్పు. దేశంనిండా సమస్యల ఎండుటాకులు పరుచుకొని ఉన్నప్పుడు, మంట ఎక్కడో ఓకాడ అంటుకొని తీరుతుంది. ఎవడైతే ఇరువై నాలుగ్గంటలు కష్టపడికూడా తన కనీసవసరాలైన కూడు గుడ్డకు నోచుకోక దినదిన గండంగా బ్రతుకుతుంటాడో? వానికి జీవితమే పోరాటం నేర్పుతుంది. ఎమీబా కూడ అంతిమక్షణం వరకు తన ఉనికికోసం పోరాటంచేస్తుంది. దీనికి నేను దాఖలాలు ఋజువులు చూయించాల్సిన పనిలేదు.

అయితే చాలామంది పరిస్థితులతో రాజీపడతారు. అందుకోసం శతవిధాల ప్రయత్నాలు జరుగుతుంటాయి. అంతిమంగా "రాజీ"తొలిగిపోతుంది. అదంతా వేరేవిషయం.

"రాజీ పడలేను" అన్న శాయిలు కొడుకు ఎందుకు రాజీపడలేడో? అతని జీవితం తొలిపాదంలోనే ఎన్ని ఎదురుదెబ్బలు ఎదుర్కోవాల్సి వచ్చిందో? ఆచిన్నారి మెదడులో ఎన్నివందల మెఘావాట్ల విద్యుత్తున్నదో ఎలాచెప్పడం?

ఆపిలగాడు రోజు గుర్తుకు వస్తూనే ఉంటాడు. నేను అప్పుడప్పుడు శాయిలు వెంట అతనింటికి వెళతూనే ఉన్నాను. అదేపాత మంచంలో, వెల్సిపోయిన శద్దర్‌లో కూర్చుండి అనెక్కరు పిలగాన్ని తదేకంగా చూస్తూనే ఉన్నాను. పాప చాయ్‌కాస్తుంది. ఎన్నోమాటలు చెపుతుంది. ఆమాటల్లో, ఆగొంతులో ఇప్పుడిప్పుడే కొత్త ఆశలు.

అతను అప్పుడప్పుడు దగ్గుతున్నాడు. దగ్గినపుడు నెత్తురు పడుతూఉంది. అప్పుడు అతని ముఖంలో మృత్యువు నీడలు తొంగిచూస్తాయి. ఎరుపెక్కిన కళ్లల్లో ఇంకిపోయిన కన్నీళ్లు. అతని సర్వస్వం పాపయే. కాని అతను పాపనుచూసి బాధపడుతుంటాడు.

కాలం కదిలిపోతోంది. పార్టీలు మారుతున్నాయి. మారినప్పుడల్లా ఎన్నెన్నో కొత్తవాగ్దానాలు చేస్తూనేఉన్నారు. మీటింగులు జరుగుతూనే ఉన్నాయి.... ప్రణాళికల్లో వేల కోట్ల పెట్టుబడి పెడుతున్నట్టుగా పేపర్ల నిండా అంకెలు కన్పిస్తునే ఉన్నాయి.

కాని కార్మికుల జీవితాలల్లో మౌలికమైన మార్పులంటూ లేనేలేవు. అదే బొక్క టోపి, మసి గుడ్డలు, పీక్కపోయిన దవడలు, ఎరుపెక్కిన కళ్లు, గవర్నమెంటు నీళ్ల సారా! అవే పందుల గుడిసెలు. రాత్రి మేమింకా మా భార్యలను, పిల్లలను విడిచి

బొగ్గుతట్టలు మోస్తూనే ఉన్నాం. ఉత్పత్తి పెంచుతున్నాం- కాని- మా జీవితాలల్లో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

ఆరోజు ఏ రివిజనిస్టు నాయకుడు లేకుండానే మా పిట్‌లో సమ్మె మొదలైంది. సమ్మె కారణం అతి స్వల్పమైనదే కావచ్చు- కాని సమ్మె తీవ్రరూపం దాల్చింది. సర్వేసు వర్కు చేసే టెంపరరీ మజుదూర్లు ఎండలో కాలేకాళ్లతో తట్టమోయాలి.... తీరా తెచ్చుకున్న టిఫిన్ తినాలంటే ఎర్రటెండే గతి. కనీసం మంచినీళ్ల నల్లానన్నలేదు- ఈ దేశంలో మంచినీళ్ల నల్లకోసం రేకుల షెడ్డుకోసం కూడా సమ్మె చేయక తప్పని పరిస్థితి.

సమ్మె వుధృతమై అన్ని ఇంక్‌లైన్‌లను వూపింది. మొత్తం సర్వేసు వర్కర్లు సమ్మెలో పాల్గొన్నారు- వాళ్లకు మద్దతుగా అన్ని కార్మిక సంఘాలు ప్రకటనలుచేశాయి. ట్రేడ్‌యూనియన్ నాయకులు నిర్విరామంగా ఉపన్యాసాలు దంచుతూనే ఉన్నారు. మేనేజిమెంటువారితో మంతనాలు జరుపుతూనే ఉన్నారు. కాని నల్లాలు పెట్టబడలేదు- రేకులషెడ్డు నిర్మాణము కాలేదు.

## 3

సరిగ్గా అలాంటి పరిస్థితిలోనే మా ఫిట్ పరిస్థితి ఏమీ బాగలేదు. అన్ని గులాయిలు (బొగ్గు తవ్వుతున్న ఏరియా) లాంగ్‌బార్ (ప్రమాద స్థితిలో గులాయిని మూసి వేయడం) అయ్యే స్థితిలో ఉన్నాయి. దాదాపు అన్ని గులాయిలల్లో అంచనా ఒకపైతే కూలడం పేరొకటౌతున్నది. అలాంటి పరిస్థితిలోనే మేము డ్యూటీ మీదికెళ్లాము. ఒకటవ నంబర్, రెండవ నంబర్, నాల్గవ నంబర్ గులాయిలు మూసివేశారు, మూడవ నంబరు గులాయి కూడ ఏమంత కండీషన్‌లో లేదు. ఆ విషయం మీద మేము పని మీదికి వెళ్లేముందే వోర్‌మన్‌తో ఘర్షణ పడ్డాము- కాని వాడు చిన్న ఏనుగుపిల్ల- వానికి ఏజెంట్ల కాల్లునాకుడు సరదా- ఇక్కడ ఎంత ప్రమాదమైన పర్వాలేదు- బొగ్గు కుప్పను ఏజెంటుకు చూయించాల్సిందే- అందరం భయం భయంగానే డ్యూటీ మీదికెళ్లాము- షాట్‌ఫైరర్ మందు దట్టించిండు- పేలింది- బొగ్గు కూలింది. కమాన్ కర్ర టగటక లాడించుకుంటూ అక్కడిక్కడ పొడిచుచూసిండు- బాగానే ఉందని కండ్లెగరేశాడు- మొకదమ్. కదిలిండు.

శాయిలు తట్ట, చెమ్మాస్ తీసుకొని లోపలికి నడిచిండు- అందరిని తిడుతూ.... ఎందుకో అందరి మనసుల్లో బుగులున్నది- అయినా మరో యిద్దరు శాయిలు దగ్గరికి నడిచిండ్రు.

శాయిలు చెమ్మస్ ఎత్తి బొగ్గు కుప్పకు కుచ్చిండు అంతే....

ఆ తరువాత ఏం జరిగిందో తెలియదు.... నేనుమాత్రం హాస్పిటల్ బెడ్డుమీద ఉన్నాను. నా తలకు బలమైన గాయాలే తాకినయ్. నా పక్క లక్ష్మి నిలబడి ఉన్నది. మా నాన్న, అవ్వ ఎడంపేస్తున్నారు.... కథంతా మామూలే....

మధ్యాహ్నం సమయానికి పాపవచ్చింది. పాపను ఆ స్థితిలో ఇదివరకు ఎప్పుడు నేను చూల్లేదు. తలంతా పిడుచగట్టుకపోయింది. తుఫాను గాలిలో తప్పిపోయిన గువ్వ పిట్టలా చూస్తోంది. వచ్చి రావడంతోటే నన్ను చుట్టుకొని ఏడ్చింది.

ఆతరువాత లక్ష్మి బలవంతంగా బయటకు పాపను తీసుకవెళ్లింది. డాక్టరు, ఇంజెక్షను ఇచ్చి వెళ్ళాడు.

ఆతరువాత మాషిఫ్ట్‌లో నాతో పనిచేసే లింగయ్య వచ్చికలిసిండు. అతను చెప్పిన విషయాలు విని నేను చావనందుకు విచారించాను.

"అప్పుడు కూలిన పెళ్లకింద శాయన్న మైసన్న కనీసం కన్పించకుండ పోయిండ్రు వాళ్లను బయటకు తీయడంకూడ సాధ్యం కాలేదు. బొంద్యాలు మాత్రం మొండం శతల ఉండంగ కాళ్లు పెళ్లకింద ఉండిపోయినయ్. మూడులోజులు ఎంత ప్రయత్నించినా కాళ్లతీయడం సాధ్యం కాలేదు. చివరకు అక్కడికి కాళ్లుకోసేసి తీస్కచ్చిండ్రు. ఇంకా తెలివికి రాలేదు. పాపం శాయన్న బిడ్డగతే ఏడ కాకుంటయ్యింది. బాయి బాయంత లాంగ్‌బార్ చేసిండ్రు. పర్మనెంటోల్లంత పయివ్ ఇంక్లైన్ల చేత్తండ్రు. ఇంకొందరిని కొత్తగూడెం పంపిండ్రు." ఆ తరువాత లింగయ్య ఆగిండు.... ఆగి అటీటు చూసిండు.

"మనందరిని తీసేసిండ్రు. వీలునుబట్టి...." లింగయ్య ఏదో చెప్పుతున్నాడు. డాక్టరు మళ్లీవచ్చి లింగయ్యను పంపించేసిండు.

బయట పాప ఏడుస్తున్నట్లున్నది. సన్నగా మూలుగు విన్పిస్తోంది.... మాఅవ్వ ఓదార్చుతున్నది. తల వంచాలనుకున్నాను. బాధగా యుంది. పక్కగోలుగా తిరిగి కిటికివేపు చూశాను. లక్ష్మి కిటికీ నుండి ఎర్రటెండలోనికి చూస్తోంది.

అవును.... బ్రతుకంతా ఎండే అయిపోయింది.

ఆ సమయంలో శాయిలు కొడుకు రాజీపడలేని నెక్కరు పిలగాడు కన్పడ్డాడు. ఏ బాధాసర్పదష్టులమధ్య, ఏ పతితులమధ్య? ఏ తాగుబోతులమధ్య, దొంగలమధ్య,

## గుండెల్ని చిక్కుళ్ళు

ఆరోజు గొప్ప విచిత్రం జరిగింది.

రైల్వే స్టేషనున్న ఆ చిన్న పట్టణంలో నాకో మిత్రుడున్నాడు. అతన్ని కలవ డానికి వెళ్తున్నాను. అతడు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు.

ఇసుకతో నింపివున్న గాడిదల బండ్లు బారులు దీర్చి బరువుగా కదులుతున్నాయి. వాటి పక్క పక్కన నడవడం నాకు కష్టంగా తోచింది. కష్టంలో భారంగా వదిలివేయ బడుతున్న గాడిదల శ్వాస నా వీపుమీద దెబ్బ పెట్టులాగా తగలడం భరించలేకపోయాను. రైల్వే పట్టాలకు అవలివైపు వున్న మరోబాటకు చేరుకుందామని నిశ్చయించుకున్నాను. పట్టాలు దాటుతున్నప్పుడు- చక్రాల శబ్దంలో ఆవిరి వదిలేస్తూ వస్తున్న రైలు కనిపించింది. మరో క్షణం తర్వాత, ఏడెనిమిది అడుగుల దూరంలో ఒక కుర్రవాడు కనిపించాడు. అతడు పట్టాలమధ్య రాళ్ళలో దేనికోసమో వెదుకుతున్నాడు. వస్తున్న రైలును ఏమాత్రం పట్టించుకోకుండా తన పనిలో తాను నిమగ్నమై వున్నాడు.

“లేలే- అక్కణ్ణించి లే” గాబరాగా అరుస్తూ అతనివైపు పరుగెత్తాను. బండ్లు నడుపుతున్న వాళ్ళు కూడా గట్టిగా కేకలేశారు.

---

తిరుగుతున్నాడో?.... వాళ్ల జీవితాల్లోని కుళ్లును ఎత్తిచూపి దానికి మార్గమేమిటో చెప్తున్నాడో?.... ఏ అడివి కొడుపుల గిరిజనులతో చింతంబలి తాగుతూ, విల్లం బును ఎక్కుపెట్ట నేర్పుతున్నాడో? నాకేం తెలుసు....

కాని నాకు మాత్రం అతను జీవిత సత్యాన్ని బోధిస్తున్నట్టుగా అన్పిస్తుంది- “జీవితంతో రాజీ పడలేము ఈ సమాజం; దోపిడిదార్లు రాజీపడనీయరు- బ్రతుకును దినదిన గండంగా చేస్తారు- తప్పనిసరైన పరిస్థితిలోనే మనం పోరాటం చేయాల్సి వస్తుంది.”

లక్ష్మిని పిలిచి నేను లేస్తానన్నాను- లక్ష్మి డాక్టరును అడిగివచ్చింది- తోడుగా నర్సుకూడా వచ్చింది. కిటికీ ప్రక్క స్టూల్‌మీద కూర్చున్నాను- బహుశా ఇంకో పదిహేను రోజుల్లో కోలుకోవచ్చు- అయితే అయితే కాలేదు- నానా గడ్డికరిచి సంపాదించిన ఉద్యోగం ఊడిపోయింది.

కిటికీ నుండి బయటకు చూశాను- భూమి మండుతోంది- రేగుతున్న దుమ్ము మండుతోంది- ఆ మంటల్లో గుడిసెలు కాలిపోతున్నాయి,... ఆ మంటల్లోనే మా నాన్న, అవ్వ, పాప నడుచుకుంటూ వెళ్ళిపోతున్నారు- ఇంకా పదిహేను రోజులకు నేను లక్ష్మి కూడ అదే మంటలోకి వెళ్ళిపోతాము.